క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దహెగాం: మండలంలోని కుంచవెల్లి, చినరాస్పెల్లి గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఆదర్శనగర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఇన్‌చార్జి ఏఈ సంతోశ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు బాలాజీనగర్, నౌగాంబస్తీ, కౌసర్‌నగర్, మార్కెట్ ఏరియా, సంజీవయ్యకాలనీ, కాపువాడలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రెబ్బెన: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

‘క్రీడామైదానంలో ఎగ్జిబిషన్ పెట్టవద్దు’

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయవద్దని సిర్పూర్ నియోజకవర్గ సీపీఎం ఇన్‌చార్జి ముంజం ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రతీ ఏడాది పట్టణంలోని ఆడపడుచులు క్రీడామైదానంలో బతుకమ్మ ఉత్సవాలను జరుపుకునే వారని, ఈ ఎగ్జిబిషన్ వల్ల బతుకమ్మ ఉత్సవాలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. వాకింగ్, వ్యాయామం చేసేవారికి కూడా ఇబ్బందిగా మారుతుందన్నారు. ఎస్పీఎం యాజమాన్యం వెంటనే ఎగ్జిబిషన్‌ను క్రీడామైదానంలో ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

‘ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలి’

కాగజ్‌నగర్‌రూరల్: ఆరె కులస్తులను జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఎన్సీబీసీ చైర్మన్ హన్సరాజ్ అహిర్‌కు శుక్రవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఎన్సీబీసీ సమీక్షా సమావేశానికి హాజరైన జాతీయ వెనుకబడిన తరగతుల సంఘం చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ విషయమై చైర్మన్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని పక్కా సమాచారం రావడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పెంచికల్‌పేట్ ఎస్సై ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఏపీ 15 టీసీ 2394 బొలెరో వాహనంలో 21 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా.. స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ మహేశ్‌తో పాటు సావాద్, అవేజ్, పవన్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ దినేశ్‌రెడ్డి, సీఐ అనిల్, డీటీ పోచయ్య, ఎస్సై కొమురయ్య, ఆర్‌ఐ సురేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. గణేశ్ మండపాల నిర్వాహకులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

విద్యార్థికి సన్మానం


వర్షిత్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయస్థాయి ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి వర్షిత్‌ను శుక్రవారం ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వర్షిత్ జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి, ఈ నెల 1 నుంచి 7 వరకు అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్నాడని తెలిపారు.

రమణ సేవలు చిరస్మరణీయం

కాగజ్‌నగర్‌రూరల్: ఉద్యమకారుడు టీఎస్‌పీ రమణ సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. శుక్రవారం మండలంలోని వంజీరి గ్రామంలో రమణ రెండో వర్ధంతిని నిర్వహించారు. ప్రజలు, కార్మికుల పక్షాన పోరాటాలు చేశారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ముంజం ఆనంద్ కుమార్, ముంజం శ్రీనివాస్, కోట శ్రీనివాస్, సాయి, వసాకె సాయి, నితీశ్, మల్లయ్య, చంద్రయ్య, సంజీవ్, శంకరమ్మ పాల్గొన్నారు.

పెరిగిన ‘సన్నాల’ సాగు


నంబాల శివారులో ఆశాజనకంగా వరి

- మండలంలో 6600 ఎకరాల్లో వరి సాగు
- సన్నాలకే జై కొట్టిన రైతులు
- చెరువులు, కుంటల కింద ఆలస్యంగా నాట్లు

రెబ్బెన: ఈసారి వాతావరణం పంటల సాగుకు అనుకూలంగా మారింది. సీజన్ ప్రారంభంలో భారీ వర్షాలు లేకపోయిన ఇటీవల కురిసిన వర్షాలు పంటలకు ఆశాజనకంగా మారాయి. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండు కుండలా మారటంతో ఆయకట్టు కింద పూర్తిస్థాయిలో వరిని సాగు చేశారు. సీజన్‌లోనే వరినార్లు పోసుకోగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురువగా చెరువులు, కుంటలు నిండక వరినాట్లు వేసుకోలేదు. అయితే కొన్ని రోజుల క్రితం పడిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు అలుగులు పారడటంతో వరిసాగుకు జీవం పడినట్లైంది. దీంతో రైతులందరూ వరినాట్లు ఆలస్యంగా వేసుకున్నారు.

రైతుల ఆసక్తి..

సాధారణంగా వానాకాలంలో చాలా మంది రైతులు సన్నరకం వరిని సాగు చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే అధిక విస్తీర్ణంలో సాగు చేసే రైతులు మాత్రమే వానాకాలంలోనూ దొడ్డురకం సాగుకే ఆసక్తి చూపుతారు. కానీ ఈసారి మాత్రం మండలంలోని రైతులందరూ దాదాపు సన్నరకం వరిసాగుకే మొగ్గు చూపారు. గతంలో 80 శాతం రైతులు సన్నాలు, 20 శాతం రైతులు దొడ్డురకం వరిసాగును చేపట్టగా.. ఈసారి నూటికి నూరు శాతం రైతులు సన్నరకం వరిసాగునే చేపట్టినట్లు వ్యవసాయాధికారులు చెప్పుతున్నారు. దొడ్డురకం వరిధాన్యాన్ని అమ్ముకోవటంలో ఏర్పడుతున్న ఇబ్బందులు, సకాలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవటం, ప్రైవేట్‌లో సన్నరకాలతో పోల్చితే దొడ్డురకాలకు ధర తక్కువగా ధర పలకడం వంటి కారణాలతో రైతులు సన్నాల సాగుకే జైకొట్టారు. దానికి తోడూ గత సంవత్సరం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గరిష్టంగా క్వింటాల్‌కు రూ. 2202, కనిష్టంగా రూ. 2182 మాత్రమే చెల్లించగా ప్రైవేట్ వ్యక్తులు సన్నరకం ధాన్యానికి గరిష్టంగా క్వింటాల్‌కు రూ. 3200, కనిష్టంగా రూ. 2300 వరకు చెల్లించారు.

తెగుళ్ల బెడద అధికం..

సన్నరకం వరి పంటలకు తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది. పంటలకు ఆశించే చీడ పీడలను నివారించేందుకు రైతులు క్రిమిసంహారక మందులను అధికంగా పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. ప్రస్తుతం పంటలన్నీ ఆశాజనకంగా ఉన్నా.. కొన్ని ప్రాంతాల్లో కాండతొలుచు పురుగు, పచ్చపురుగు ఉధృతి అధికంగా కనిపిస్తోంది. అక్కడక్కడ ఆకు ఎండు తెగులు కనిపిస్తోంది. క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలించి పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణను చేపట్టాల్సిన చర్యలపై వ్య వసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు కరువయ్యాయి. వరిలో పెరుగుతున్న కలుపులు రైతులకు పెద్ద తలనొప్పిగా మారుతున్నాయి. కలుపుల నివారణకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కూలీల కొరత ఉండడంతో దాదాపు రూ. 2500 వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి వరిధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఆశాజనకంగా పంటలు

వానాకాలం వరి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇప్పటికైతే పంటలకు ఎలాంటి ఢోకా లేదు. అధిక వర్షాలతో కుంటలు, చెరువుల కింద సైతం పూర్తి స్థాయిలో వరిసాగు చేపట్టారు. గతంతో పోల్చితే ఈసారి దాదాపు రైతులందరూ సన్నరకం వరినే సాగు చేశారు. తెగుళ్ల సోకితే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలి.

– గోపినాథ్ ఇన్‌చార్జి, మండల వ్యవసాయాధికారి

అరకకు డిమాండ్


పత్తిలో డౌర కొడుతున్న రైతు

- ఒక్క రోజుకు రూ.2 వేలు
- యాంత్రిక వ్యవసాయంతో దొరకని డౌరలు
- గ్రామాల్లో ఎడ్ల కొరత

ఆసిఫాబాద్‌రూరల్: వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునిక వ్యవసాయంలో యంత్రాలు రావడంతో కాడెడ్లు కనుమరుగవుతున్నాయి. విత్తనాలు వేసేందుకు మనిషితో సహా అరకతో కూడిన కాడెడ్లకు రూ.1500 నుంచి 2000 చెల్లిస్తున్నారు. నూతన టెక్నాలజీతో చాలా మంది రైతులు ఆధునిక పద్ధతులను మరిచి ట్రాక్టర్‌తోనే వ్యవసాయ పనులు చేస్తున్నారు. అరకతో ఒక రోజు చేయాల్సిన పనిని ట్రాక్టర్ ఒక గంటల్లో పూర్తి చేస్తున్నాయి. దీంతో చాలా మంది ట్రాక్టర్లతోనే వ్యవసాయం చేస్తున్నప్పటికీ.. తరువాత కలుపు నివారణ తేమ శాతం పెంచేందుకు అరకతో కూడిన డౌవురతో సాగు చేయాల్సి ఉండటంతో అరకకు డిమాండ్ పెరిగింది.

చేతినిండా పని..

ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా.. కాడెడ్ల జతలు తక్కువ ఉండడంతో అరకకు డిమాండ్ పెరిగింది. గతంలో ఇరుగు పొరుగు వారు కలసి విత్తనాలు వేసుకునే వారు కానీ ప్రస్తుతం భూమిలో తేమ అరి పోతుందనే ఉద్దేశంతో ఎవరికి వారే విత్తనాలు వేస్తున్నారు. సాధారణంగా పత్తి వేరుశనగ, కంది పంటను కాడెడ్లతోనే వేస్తుటారు. పొలం పనుల్లో గొర్రుకు, అరకకు కాడెడ్లు ఉపయోగిస్తారు. దీంతో కాడెడ్లు అరక ఉన్న వారికి పత్తిలో కలుపు నివారణ. తేమ కోసం డౌవుర తప్పని సారి కావడంతో అరకు ఉన్న రైతులకు వారం పది రోజుల ముందే అడ్వన్స్ ఇస్తున్నారు. ట్రాక్టర్ ఉన్న వాళ్లు సైతం పత్తిలో అరకపై అధారపడాల్సిందే. అరకకు రోజుకు రూ.2000 వేలు తీసుకుంటున్నారు.

ఎడ్లను పోషించుకోలేక..

ఒకప్పుడు ప్రతీ రైతుకు కనీసం నాలుగైదు కాడెడ్లు, ఆవులు ఉండేవి. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయం రావడంతో ఒక రోజు చేయాల్సి పనిని గంటలో పూర్తి కావడంతో బీడు భూములు లేకుండా పత్తి సాగు చేస్తున్నారు. దీంతో పశువుల మేత కోసం స్థలం లేక చాలా గ్రామాల రైతులు వాటిని అమ్ముకుంటున్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాల్లోనే పశువులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కాడెడ్లను పోషించే స్థోమత రైతన్నలకు ఉన్నా.. నీరు పెట్టడం, మేత వేయడం వంటి పనులు చేయలేక అమ్మేస్తున్నారు. దీంతో అరకకు డిమాండ్ పెరిగింది.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేందర్


ఓటర్ జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

దహెగాం: గతకొన్ని రోజులుగా వార్డుల వారీగా ఓటరు జాబితా సవరణ చేపట్టామని ఓటర్లకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 20 లోగా తెలియజేయాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో, స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే వార్డులోకి ఉండేలా అధికారుల ఆదేశాల మేరకు సవరణ చేశామన్నారు. అభ్యంతరాలు ఉంటే పంచాయతీ కార్యాలయాల్లో తెలియజేయాలన్నారు.

పెంచికల్‌పేట్: గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటరు జాబితాలను ఎంపీడీవో కార్యాలయంతో పాటు పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ఇటీవల ఓటరు జాబితాను మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. అభ్యంతరం ఉంటే పరిశీలించి పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులతో సరిచేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యదర్శులు నరేశ్, చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల: మండల ఓటర్ లిస్ట్ జాబితాను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కోట ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ జాబితాను సవరించి ప్రదర్శించడం జరిగిందన్నారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. ఓటర్ జాబితాలో సవరణలు ఉంటే పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలన్నారు. కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి హన్మంతు, ఏపీవో పూర్ణిమ, కార్యదర్శులు సాయికృష్ణ, రమేశ్, సునీత, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏచూరి మరణం దేశానికి తీరని లోటు


నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయ అధ్యక్షుడు సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయికృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థి హక్కులపై పోరాడుతూనే నాటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు ధైర్యంగా ఉండి కొట్లాడరని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ నితీశ్, కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు తేజస్విని, శృతి, చిత్తరంజన్, హుమరా బేగం, సహాయ కార్యదర్శులు అఖిల, ప్రవలిక, జయప్రకాశ్, తిరుమల, ఝాన్సీరాణి, పూజ, అనూష, సంజన, పవన్ పాల్గొన్నారు.

భూమి ఆక్రమించిన ముగ్గురిపై కేసు


కందకాలు తవ్విస్తున్న ఫారెస్టు అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కడంబా గ్రామ శివారులోని ప్లాంటేషన్ భూమిని ఆక్రమించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో శశిధర్‌బాబు తెలిపారు. శుక్రవారం ప్లాంటేషన్‌లో ఆక్రమణలను తొలగించడంతో పాటు ప్లాంటేషన్ చుట్టూ కందకాలను ఫారెస్టు అధికారులు తవ్వారు. కంపార్టుమెంట్ నెం.129లోని ప్లాంటేషన్ భూమిని ఆక్రమించిన కోట మల్లయ్య, ఉషన బోయిన మల్లయ్య, మల్లబోయిన రాజులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఫారెస్టు భూములను ఆక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పటేకర్, ఎఫ్ఎస్‌వోలు మనోహర్, కామరాజు, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కాగజ్‌నగర్‌లో సమావేశం

కౌటాల: కాగజ్‌నగర్ పట్టణంలో ఈ నెల 15న టాటా కంపెనీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సురేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు కాగజ్‌నగర్‌లోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు సకాలంలో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 89787 83124 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ అన్నారు. శుక్రవారం కెరమెరి మండలంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ రద్దు పాత పెన్షన్ అమలు, 317 జీవో ఉపాధ్యాయులకు న్యాయం, ఉపాధ్యాయుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ మంజూరు, లోన్లను పాక్షిక ఉపసంహరణ, పెండింగ్ బిల్లు మంజూరు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియమకం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భరత్, రవితేజ, శివ ప్రసాద్, సురేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కౌటాల: మండలంలోని ఆయా గ్రామాల్లోని గణేశ్ మండపాల్లో భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గణ నాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. కౌటాల మండల కేంద్రంలోని కౌండిన్య గణేశ్ మండలి, శ్రీ కో దండ రామాలయంలోని గణేశ్ మండలంలో, శీర్ష గ్రామంలోని భూలక్ష్మి గణపతి మండపాల్లో మహిళలు కుంకుమార్చన చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

కాగజ్‌నగర్ రూరల్: గణేశ్ నవరాత్రులు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. శుక్రవారం గణనాథునికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు కుంకుమ పూజలు చేశారు. పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాలో శ్రీవిశ్వరూప గణేశ్ మండలి, భగత్‌సింగ్ రోడ్డులోని ఓంశ్రీసాయి గణేశ్‌మండలి, సంఘం బస్తీలోని సుభాష్ యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో, కాపువాడలోని శ్రీఆదిత్య గణేశ్ మండలి, శ్రీసాయి గణేశ్ మండలి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తంపేటలోని బారెగూడ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదవడం, రాయడం మాట్లాడంలో ముందుండేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట సీఆర్పీ ప్రకాశ్, ఉపాధ్యాయులు సాయికిరణ్, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న ఆసుపత్రి కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులకు రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసుపత్రి ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మూడు నెలలుగా కార్మికుల వేతన బడ్జెట్ విడుదల చేయలేదని, దీంతో ఏజెన్సీ కాంట్రాక్టర్లు కార్మికులకు సకాలంలో వేతనాలను చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులు ఇంటి అద్దెలు, నెలవారి ఈఎంఐలు, పొదుపు సంఘాల చెల్లింపులు, పిల్లల ఫీజులు కట్టుకోలేక మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలను విడుదల చేసి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి చిరంజీవి, కార్మికులు మల్లేష్, సత్తార్, మురళి, మమత, తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు


రెబ్బెన: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

రెబ్బెన: ఆయా గ్రామాల్లోని గణనాథుల వద్ద శుక్రవారం ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌లో వినాయకుడి మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. తుంగెడలో హనుమాన్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రతీరోజు మహిళలు మంగళహారతులతో పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. పైకాజీనగర్ బాల గణేశ్ మండలి వద్ద అర్చకులు మహేశ్ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. బజార్‌వాడిలోని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీఎం దంపతుల పూజలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీతో పాటు గోలేటి సీహెచ్‌పీలో ప్రతిష్ఠించిన గణపయ్యను శుక్రవారం జీఎం శ్రీనివాస్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు ఉమారాణి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే పాల్గొన్నారు.


ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్‌లో..

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల గణనాథుడిని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే హరీశ్ బాబు దర్శించుకున్నారు. గణనాథునికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

అనారోగ్యంతో వ్యాపారి మృతి

కౌటాల: మండల కేంద్రానికి చెందిన హోటల్ వ్యాపారి రాచకొండ చంద్రమౌళి(66) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 10న చంద్రమౌళికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. కౌటాల మార్కెట్ ఏరియాలో వ్యాపారులు తమ దుకాణాలను బంద్ పాటించారు.

అటవీ అధికారులకు కుందేళ్లు అప్పగింత


అధికారులకు కుందేళ్లను అప్పగిస్తున్న

బెజ్జూర్: వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో సెండే బాపు అనే రైతుకు రెండు కుందేళ్లు దొరికాయి. దీంతో ఆయన అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించాడు. వన్యప్రాణికి హాని కలిగించకుండా అటవీశాఖ అధికారులకు కుందేళ్లు అప్పగించిన సెండే బాపును అధికారులు అభినందించారు. వన్యప్రాణులను కాపాడటం అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రావణ్, బీట్ ఆఫీసర్ వెంకటేశ్ తెలిపారు.